# కాబూలీవాలా

మరమరాలు చెట్టున కాస్తాయనీ, తొక్కుడు లడ్డు అంటే కాళ్ళతో తొక్కిస్తారనీ, పాపాయిలు పుట్టడవంటె దేవుడు పిల్లల్ని తీసుకొచ్చి ఒళ్ళో కూర్చోపెట్టడవనీ, కాబులీ దానిమ్మపండంటే కాబులీవాళ్లు దాన్ని దొడ్లో వేసి పెంచి కాస్తే తీసుకొచ్చి మనకు అమ్ముతారని నమ్మేసేదాన్ని.

ఐస్ క్రీం, బొబ్బట్టు పులిహోరను జయించునా.

కోల్డుక్రీం కొబ్బరినూనెకంటె బాగా పన్చేయునా-

మీసాలు వాల్జడను లొంగదీయునా-

మల్లెపూలు, సిగరెట్టును జయింపగలవా-

లాల్చీతో బుష్షర్టు నెగ్గకలదా-

ఆకుచెప్పులు, కాబులీ శాండల్సును అణచివేయునా-

ఇవన్నీ నా సందేహాలు.

కాబులీ దానిమ్మపండంటె నాకు చాలాయిష్టం- గాంధీగారికి మేకపాలు, వేరుశెనగ పలుకులూ యిష్టంట. నాకు పకోడిలు తిన్నా, పెసరపుణుకులు తిన్నా అలానే వుంటుంది. రూపాయైనాసరే కాబూలీదానిమ్మపండు కొనుక్కుని ఆ గింజల్ని వొల్చుకొని ఒళ్ళో పోసుకుని తింటూ కూర్చుంటె చాలా హాయిగా వుంటుంది. (ట్రయి చేయండి) కొబ్బరి అటుకులు బెల్లం వేసి రోట్లో కచ్చాపిచ్చాతొక్కి తొక్కుడులడ్డూ చేసుకుని ఆ వుండలు తింటూ డబ్బెట్టి పేకాడుతుంటే బలే గమ్మత్తుగా వుంటుంది. ఉల్లిపాయ పకోడిలు తిని నిమ్మకాయ సోడా తాగి మొగుడితో

పోట్లాడి మాట్లాడ్డం మానేసి, చాపమీద పక్కేసి సీరియల్ నవల చదువు కుంటూ పడుకుంటే బలే మజాగా బాగుంటుంది.

మావారికి కాబూలీశాండల్సంటె యిష్టం. నాకా జోళ్ళను చూస్తే వళ్లుమంట. కాబుల్లో చేసి మావారికి పోస్టులో పంపించారు కావొల్ను అనిఅనుకునేదాన్ని. కాబూలీ శాండల్సన్నా కాబూలీవాలా అన్నా నాకు గిట్టదు. వడ్డీ వ్యాపారం అంటే నేను లైక్ చెయ్యను. డబ్బుకోసం మనుష్యుల్ని పీడించుకు తినేవాళ్ళను నేను హీరో చేసి ఆరాధించను. టాగూర్‌మీద నాకు కోపం వచ్చింది అందుకే. కాబూలీవాలా కథ చద వగానే యాంగ్రీ అగ్నిహోత్రావధాన్లు కూతుర్నయిపోయాను. వాటీజ్ దిస్? టాగూరు యిలా రాశాడు.

లెనిన్‌గడ్డం గొప్పదా? టాగూర్‌గడ్డం గొప్పదా అంటే ఠక్కున మావారు టాగూరు గడ్డవే గొప్పదంటారు. ఆయనకు టాగూరంటే బెల్లప్పరవాణ్ణమంత యిష్టం.

ఈ కాబూలీవాలా అంటే జనానికి శనిక్లాస్‌వాడుకదా? ఈ శని క్లాసుగాడికి యింత గొప్ప అంటగట్టడవేమా అని నా దుగ్ధ. మీరే చెప్పండి— అప్పులిచ్చి వడ్డీలకోసం ఖూనీచేసే ముండాకొడుకుని పెద్ద హీరోచేసి రాయడమేమిటి? గెటవుట్ అని మెడపట్టుకు గెంటెయ్యా ల్సింది. ఏవిటో గ్రేట్‌మెన్ మనకి అర్థవయి ఛావరు. మిని అనే గుంటతో ఆడుకున్నాడ్ట అందుకని ఆ పిల్లను చూడ్డానికి జైలునుంచి మళ్ళీ వస్తాడ్ట, అందరూ హడిలి చచ్చేలా! బలేవాడే టాగూరేవిటో బలేగా రాస్తాడండి.

విశ్వకవులు ఎలాటివాళ్ళను మోసేసినా మోసీగల్రు— కాబూలీ వాలాను చెట్టెక్కించి కూర్చోపెట్టగల్రు. నాకేవిటో సిల్లీథాట్స్ వచ్చి యిలా గందరగోళం పడిపోతుంటాను. టాగూర్తో మాట్లాడాలి. లేదూ— పోయాడా— ఎప్పుడూ? నేను పుట్టకముందే.... మళ్ళీ పుట్టడూ? ఎక్కడో పుట్టేవుంటాడు— పునర్జన్మ ఎలాగూ వుంటుందిగా యిలాటి కథలు

వ్రాసినవాళ్ళకి. (టాగూరు రచయిత్రి అయి జన్మిస్తే తప్పకుండా గడ్డం వున్నవాళ్ళనే పెళ్ళాడ్తాడు.) ఏం లేదు. అ కథ మళ్ళీ వ్రాయమని అడగాలి. టాగూర్ మస్ట్ కరెక్టు హింసెల్ఫు—

నేనే ఓ కథ చెప్తా. మా అంకులొకాయన ఖరగ్‌పూర్‌లో జీతవంతా పట్టికెళ్ళి కాబూలీ వడ్డీక్రింద జమకట్టి యింటికి జనగణమన పాడుకుంటూ వచ్చేవాడు. వైఫ్ మరిద్దరు ముగ్గురు కిడ్సు- అందులో ఓ త్తి పెళ్లికెదిగింది. దాన్ని కాబూలీవాలాకిచ్చి అప్పుక్రింద అసలులో కొంత జమ వేయించుకోడానికి వీల్లేదు. కాబూలీవాడికి అసలు అక్కరలేదు వడ్డీయే కావాలి, అసలుకన్న వడ్డీ ప్రియంకదా. అప్పుడా అంకులేశ్వరుడు అర్బన్‌బ్యాంకునుంచి పిల్ల పెళ్ళికని అప్పుతెచ్చి పిల్ల పెళ్లిచేశాడు. (ఆశ్చర్యం) రైల్వేపిల్లకి రైల్వేఅల్లుడ్ని తెచ్చి చేశాడు. ఆ కట్నం మళ్లీ యిస్తాను యిలా తే అని— వద్దు ఆడపిల్లకిచ్చిన సొమ్ము మళ్లీ పుచ్చుకోకూడదు. రవురవాది నరకాలు చుట్టుకుంటాయి, నువ్వే పట్టిగెళ్లి ఆ కాబూలీవాలాకిచ్చి చెల్లువేయించుకురా అని నసిగాడు.

క్రొత్త పెళ్లాన్ని ఆషాఢమాసవని తండ్రి యమ నేర్పుగా విడదీసి తన యింట్లోనో పాకేజీ లేబిల్ వేసి మార్కింగుచేసి భద్రంగా దాచి పెట్టుకున్నాడు. తర్వాత ట్రాన్స్‌ఫరయిందనిచెప్పి వైజాగ్ వచ్చేశాడు. సముద్రపుగాలి వంటికి మంచిదికదా — పరువానికి వచ్చిన పిల్లనేమో మామ దక్కనివ్వడం లేదు. యిచ్చిన కట్నం మళ్లీ కాబూలీవాలాకు యిప్పించేశాడు. గుమస్తాఅల్లుడ్ని నీ మావ అప్పు తీర్చు అని కాబూలీవాళ్లు గొడవచేయడం మొదలెట్టారు. పిల్ల వైజాగ్‌నుంచి రోజుకో ప్రేమలేఖ వ్రాసిపడేస్తోంది.

అల్లుడు అప్పుడు టాగూర్ రాసిన కాబూలీవాలా తీసి మరోసారి శుభ్రంగా చదివి నిట్టూర్చాడు. అప్పుడు మా మావ ఇలాచేశాడు అని ఆ అల్లుడు కుర్రాడు కాబూలీవాళ్ల కాళ్ల మీద పడి యేడ్చాడు.

అప్పుడు కాబూలీవాలాయే కుర్రవాడ్ని చూసి జాలిపడి "నువ్వు కూడా వైజాగ్ ట్రాన్స్‌ఫర్ చేయించుకో మీ రైల్వే ఆఫీసరుకి నేను చెప్తాను. నాకు వాడూ నువ్వూ మీ మావా అంతా ఒకటే — అక్కడ మా కాబూలీవాళ్లకు మీ అప్పు ట్రాన్స్‌ఫర్ చేయిస్తాము. మీరంతా సంతోషంగా ఒకచోటచేరి అప్పులు తీర్చుకుంటూ కాలక్షేపంచేయవచ్చు. ఖర్చులు మీవి, కాని మరో నోటు వ్రాయి. పిల్ల నీ దగ్గరకే వస్తుంది" అనిచెప్పాడు. అల్లుడు మరోచిన్న నోటువ్రాశాడు. అంతా వైజాగ్ చేరుకున్నారు. ఇప్పుడు అల్లుడు, మావ ఇద్దరూ జాయింటుగా తమ జీతాల్ని కాబూలీవాలాకు కట్టేస్తున్నారు. అప్పలనరసయ్యకు మనవడు కలిగే సూచనలు కనిపిస్తున్నాయి.

ఇద్దరూ కాస్తోకూస్తో పై సంపాదన చేస్తున్నారు. ఉద్యోగంలో ఎన్నిరకాలైన అప్పులు తీయచ్చో అన్నీ తీసి జీవితమంతా అడ్వాన్సుల మీద గడిపేస్తున్నారు. అరువే వైభోగమే అరువే కళ్యాణమే అదే వారి జీవననీతి. పెళ్లికి పెట్టిన చీరలన్నీ మారుబేరానికి అమ్మేసి కూరలు కొంటూవుంటుంది. సినిమాలు చూస్తూ వుంటుంది అప్పలనరసయ్య కూతురు. కాబూలీవాలాతో అరుగుమీదనుంచుని గంటలతరబడి హస్కు వేస్తూవుంటుంది ఆ అమ్మాయి. పులిహోర ఆవకాయ పులుసటుకులు తెచ్చి కాబూలీవాలాకు పెడ్తూంటుంది. ఆ అమ్మాయికి కాబూలీవాలా అంటే భయంలేదు. వాడు అప్పలనరసయ్య కూతురు కడుపుతో వుందని తెలిసి కాబూలీదానిమ్మపండు తెచ్చియిచ్చాడు. అల్లుడు సన్యాసిరావు మావగారి నీడను చూస్తే ఝడుసుకుంటాడు. పెళ్లాం దగ్గరకొస్తే ఏ జేబు కొట్టేస్తుందోనని గాభరాపడిపోతాడు. కానీ కాబూలీదానిమ్మపండు తినే ఆ వోపలేని పిల్లకు తెలుసు అసలు రహస్యం. కాబూలీవాలా కాళ్ల మీదపడితే అప్పలనరసయ్య పిల్ల పెళ్లి జరిపించి కట్నాలి యిటు జమకట్టే ఏర్పాట్లు చూడమని సలహా యిచ్చింది కాబూలీవాలాయే—

ఈ స్టోరీ నేను రాద్దామనుకున్నాను టాగూరుకి ఎగనెస్టుగా. కాని ఈలోగా తెల్సింది సన్యాసిరావు పిల్లలు పుట్టకుండా ఆపరేషను చేయించుకుని డబ్బు తెచ్చి దాన్తో మంచికుటుంబం సినిమా కెళ్ళారని, పెళ్ళానికో కట్టుడుచీర కొన్నాడని, ఆవిడకు పురు డెప్పుడొస్తుందా — పురిట్లో ఎలాగైనా మాయచేసి మందుల బిల్లులు పెట్టి గవర్నమెంటు దగ్గర డబ్బు గుంజడం ఎలాగా అని ప్లానులు వేస్తున్నారు. రుక్కుకీ (అ అమ్మాయి పేరు) కాబూలీవాలా సలహా చెప్పాడు. మీరిద్దరూ కలసి ఆ ముసిలాడ్ని తరిమేయండి అని. ఇప్పుడు సన్యాసిరావు, రుక్కు, కాబూలీవాలా, ఒకటి. ముసిలాడు దేవాంతకుడు. చొక్కా బనీను చింపుకుని అరుస్తూ రోడ్ల మీద తిరగడం ప్రారంభించాడు. ముసిలాడి మరచెంబు తాకట్టు పెట్టేసింది రుక్కు. కాబూలీవాలా లోపల ఏడ్చుకుని ముసిలాడిని రైల్వే డాక్టరు దగ్గరకి తీసుకెళ్ళి బాగుచేయిస్తున్నాడు. ప్రోనోటు చింపలేదు. వడ్డీపెరుగుతూవుంటుంది. రుక్కు చెల్లెలు సక్కు పెరిగి పెద్దదయి కాబూలీ దానిమ్మపండులా వుంది. సన్యాసిరావు దానినెక్కడ ఎంగిలి చేస్తాడోనని రుక్కు వేయికండ్ల మొగుడ్ని కనిపెడుతూ వుంటుంది. బావ మంచంమీద కూర్చొని లెక్కలు చెప్పించుకోవద్దని కోప్పడుతూంటుంది చెల్లెల్ని. ఆపరేషనయిన మొగుడు — అడ్డం తీరని చెల్లెలూ! అబ్బ మిడిల్ క్లాస్ లైఫ్ ఛండాలం. టాగూర్ కివేం తెలీదు. నేనే వో పెద్ద నవల రాసితగలేస్తాను. టాగూరుకి తప్పినా నాకు తప్పదు కదా!

ఆదంతా మావారికి తెలిస్తే టాగూర్నేవన్నా అంటే గుంజీలు తీయిస్తారు నాచేత — బికాజ్ ఆఫ్ అంకుల్ అప్పలనరసయ్య అండ్ హిజ్ డాటర్సు రుక్కు సక్కు ఎట్సెట్రా, టాగూర్ మీద కొంచెంతిరగబడాల్సి వచ్చింది కాని ఆయన కేవండి ఆయన మహానుభావుడు. టాగూర్ కుందికాని గడ్డం గాంధిగారికుందా? నెహ్రూగారి కుందా? టాగూర్ మీద పోటీకథ రాసి ప్రెయిజు కొట్టెయ్యాలి, డట్సాల్—